జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 95 17-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


# చిలకలడోణ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్ణాటక కి చెందిన 9మంది మృతి.

- చిలకలడోణ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్ణాటక కి చెందిన 9మంది మృతి.
- రోడ్డు ప్రమాదానికి ప్రధానమైన కారణం డ్రైవర్ నిద్రమత్తె... కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పటేల్
- మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వెళ్తూ మృత్యువాత పడడం చాలా బాధాకరం...
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
- మరణించిన వారి కుటుంబాలకు 2 లక్షలు, గాయపడిన వారికి 50 వేలు ఇస్తామని ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ.
- మృత్యువాత పడిన వారిని మార్చురీలో పరామర్శించిన మంత్రులు, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే...





2లో



## ఈ నెల 21 నుంచి సింగపూర్‌లో పర్యటించనున్న ఏపీ మంత్రులు

- పాలన, శాంతిభద్రతలు, పర్యాటకంపై అధ్యయనం చేయనున్న బృందం
- పర్యటనపై 9 మంది మంత్రులకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు
- ఉత్తమ విధానాలను గుర్తించి ఏపీలో అమలు చేయాలని సూచన

## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...


- మపాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష
- అన్ని ప్రభుత్వ స్కూళ్లను 3 స్టార్‌కు చేర్చాలని ఆదేశం
- ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు పిలుపు
- ప్రభుత్వ కాలేజీల్లో టాపర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన




2లో

## డీలిమిటేషన్.. తెలంగాణలో 26... ఏపీలో 38

- పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య ఇదే!
- లోక్‌సభకు వెల్లడించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం స్థానాల సంఖ్య 195కు
- వాటి ప్రాతినిధ్యానికి నష్టమూ ఉండదని వెల్లడి





## దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు,

# నాది హామీ..

- డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదు..
- పార్లమెంట్ వేదికగా ప్రధాని నరేంద్రమోడీ హామీ..
- మహిళా బిల్లు క్రెడిట్ విపక్షాలే తీసుకోండి..
- అడ్డుకుంటే మాత్రం నాకే రాజకీయ లాభం చేకూరుతుంది..
- లోక్‌సభలో ప్రధాని మోడీ ఫైరీ స్పీచ్..

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 నుంచే అమలు చేసేందుకు మోదీ సర్కారు తలపెట్టిన కీలక కసరత్తు నిర్ణాయక దశకు చేరింది. రిజర్వేషన్ల చట్టం సత్వర అమలు, అందుకు వీలుగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదించిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు2026, డీలిమిటేషన్ బిల్లు2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట (సవరణ) బిల్లు2026ను కేంద్రం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. రాజ్యాంగ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో వాటి డిమాండ్ మేరకు ఈ అంశంపై డివిజన్ (ఓటింగ్)కు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. బిల్లుకు అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు వచ్చాయి. అనంతరం మూడు బిల్లులనూ కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండ్ చేసి డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల బిల్లులను ఒకేసారి పరిశీలించి ఆమోదించేందుకు అనుమతివ్వాలంటూ కేంద్ర న్యాయ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. బిల్లులు రాజ్యాంగ సవరణతో ముడిపడ్డాయి గనుక ఇందుకు



2లో

## ఏపీలో భగ్గుమన్న సూరీడు..

- నంద్యాలలో 45.1 డిగ్రీలు.. రేపు మరింత తీవ్రత!
- ఏపీలో రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లాలో 45.1 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రత
- రేపు పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అంచనా
- రాష్ట్రంలోని 85 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరిక



## తేజస్వీ వ్యాఖ్యలను తిప్పికొట్టండి

- బీజేపీ నేతల తీరును ఎండగట్టండి
- మంత్రులు, ఎంపీలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం!

2లో

## తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్



- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై ఆగ్రహం
- తెలంగాణ ఎంపీలు మౌనంగా ఉండటమేమిటని ప్రశ్న
- ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని మండిపాటు
- తెలంగాణ వ్యతిరేకత బీజేపీకి నరనరాన నిండి ఉందన్న కేటీఆర్
- తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

2లో



## ఇజ్రాయెల్, లెబనాన్ కాల్పుల విరమణ

- పదిరోజులపాటు తాత్కాలిక ఒప్పందం
- ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇప్పటికే 9 యుద్ధాలు ఆపానని, ఇది పదోదని ప్రకటన

2లో

# చిలకలడోణ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కర్ణాటక కి చెందిన 9మంది మృతి.

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక కి చెందిన 22 మంది మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి బొలెరో వాహనంలో వెళ్తూ, మంత్రాలయం మండలం, చిలకలడోణ సమీపంలో గురువారం తెల్లవారుజామున 3 గంటలకు జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో స్పాట్లో 9 మంది మృతిచెందారు. మంత్రాలయం వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఇటుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రోడ్డు ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు. ఇంకా వివరాల్లోకి వెళితే మృతులు కర్ణాటక రాష్ట్రం చిక్మంగళూర్ (డి) తరికిరీ తాలుకా ఉదయ్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మృతులు దీపిక వీణ(42), ఆమె కుమార్తె బెల్లీ(5), యశోద (60), పుట్టమ్మ (55), లాలాక్షి, మీనాక్షి, సునీల్ (40), కుమార్ (50)గా గుర్తించినట్లు మంత్రాలయం పోలీసులు తెలిపారు. మృత్యువాత పడిన వారిని పోస్టుమార్టం నిమిత్తం పోలీస్ లు ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటన స్థలానికి వెళ్లి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను ఎస్పీ పరిశీలించారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదానికి ప్రధానమైన కారణం బొలెరో డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడమే అని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ అన్నారు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను








కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మిగనూరు, కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ లో ఉన్న వారిని మంత్రి టీజి. భరత్, కలెక్టర్ డాక్టర్. ఏ. సిరి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎస్పీ విక్రాంత పటేల్, డి.ఎస్.పి భార్గవి, ఎమ్మార్వో, వీఆర్వో, మున్సిపల్ కమీషనర్, సిఐలు, ఎస్ఐలు, పరామర్శించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. కర్నూల్ లో రోడ్డు ప్రమాదాల నివారణ పై దృష్టి ఉంచి, ప్రత్యేక చర్యలు చేపడతామని మంత్రి, కలెక్టర్, ఎస్పీ అన్నారు. కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తరపున షర్మిల, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం తక్షణమే ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

## సింగపూర్ వెళుతున్న మంత్రులతో సీఎం చంద్రబాబు సమావేశం

ఆంధ్రప్రదేశ్‌లో పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో అత్యుత్తమ విధానాలను అమలు చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రానికి చెందిన 9 మంది మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఈ పర్యటన కొనసాగుతుంది. సింగపూర్‌లోని అధునాతన పాలనా వ్యవస్థ, శాంతిభద్రతల నిర్వహణ, రోడ్లు, పర్యాటక రంగాలను సమగ్రంగా అధ్యయనం చేయడమే ఈ పర్యటన యొక్క ప్రధాన లక్ష్యం. ఈ పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మంత్రుల బృందంతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, జనార్దన్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సింగపూర్‌లోని పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించాలని, అక్కడి విజయవంతమైన విధానాల్లో వేటిని ఏపీలో అమలు చేయవచ్చో గుర్తించాలని సీఎం సూచించారు. తెలుసుకున్న ఉత్తమ విధానాలను రాష్ట్రానికి తిరిగి వచ్చాక అందరితో పంచుకుని, వాటి అమలుకు కృషి చేయాలని చంద్రబాబు మంత్రులకు స్పష్టం చేశారు. ఈ పర్యటన ద్వారా సింగపూర్ తరహాలో అత్యుత్తమ పాలన, మౌలిక వసతులు, పర్యాటకాన్ని ఏపీలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఏపీలో భగ్గుమన్న సూరీడు..

ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు. మౌలిక సదుపాయాలకు సంబంధించిన చిన్న పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులున్న 60 పాఠశాలల్లో 5 స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలన్నారు. లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, టాయిలెట్లు, పెయింటింగ్ వంటి పనులను ఎస్ఎంసీలకే అప్పగించాలని సూచించారు. అయితే, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారానే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లోకేష్ ఆదేశించారు. ఇందుకోసం 'డోర్ టు డోర్' క్యాంపెయిన్ నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ ఏడాది 10 శాతం అడ్మిషన్ల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకోవాలని, డ్రాపవుట్లను సున్నా స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అలాంటి విద్యార్థులను గుర్తించి, 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో సత్కరించాలని, వారి విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను

## డీలిమిటేషన్.. తెలంగాణలో 26... ఏపీలో 38

న్యూఢిల్లీ: డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17నుంచి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి పెరగనున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల చట్ట రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చలో అమిత్ షా ప్రసంగించారు. డీలిమిటేషన్ వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళనను ఆయన తోసిపుచ్చారు. పునర్విభజన అనంతరం ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 129 నుంచి 50 శాతం, అంటే 195కు పెరుగుతుందని వెల్లడించారు. "దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గదు. పైపెచ్చు సభలో వాటి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది"అంటూ గణాంకాలతో సహా మంత్రి వివరించారు. "మొత్తం చర్చపై కేంద్ర ప్రభుత్వం తరఫున శుక్రవారం సమాధానమిస్తాను. అయితే ఒక్క విషయం మాత్రం చెప్పదలచాను. తాజాగా ప్రవేశపెట్టిన బిల్లులపై ప్రజలకు ఎలాంటి అపోహలూ వద్దు. ఈ బిల్లులతో లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గుతుందని, ఆ ప్రాంతానికి నష్టం జరుగుతుందని పెద్ద వాదనను లేవనెత్తుతూ భ్రాంతిని వ్యాప్తి చేస్తున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వదలచాను. సభ ముందున్న బిల్లుల ఆధారంగా వాస్తవాలు అందరి దృష్టికీ తెస్తాను. నియోజకవర్గాల పునర్విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 25నుంచి 38కు, ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 4.60 నుంచి 4.65 శాతానికి పెరుగుతాయి. తెలంగాణలో స్థానాలు 17 నుంచి 26కు, ప్రాతినిధ్యం 3.13 నుంచి 3.18కి పెరుగుతాయి. తమిళనాడులో సీట్లు 39 నుంచి 59కు, ప్రాతినిధ్యం 7.18 నుంచి 7.23 శాతానికి పెరుగుతాయి. కర్నాటకలో లోక్‌సభ స్థానాలు 28నుంచి 42కు, సభలో ప్రాతినిధ్యం 5.15 శాతం నుంచి 5.14 శాతానికి చేరతాయి. కేరళలో సీట్లు 20 నుంచి 30కి, లోక్‌సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 3.68 నుంచి 3.67 శాతానికి చేరతాయి. మొత్తమ్మీద దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్య 195కు పెరుగుతుంది. లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి పెరుగుతుందే తప్ప ఏ మాత్రమూ తగ్గదు. అలాంటప్పుడు దక్షిణాదికి అన్యాయమన్న ప్రశ్నే తలెత్తదు"అని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనతో పాటే కులగణన కూడా ఉంటుందని అమిత్ షా స్పష్టం చేశారు. "కులగణన చేపట్టాలని కేంద్రం భావించడం లేదని విపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. జనగణన రెండు దశల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియ మొదలైంది. వ్యక్తిగత డేటాను తీసుకునేటప్పుడు కులగణన అంశం కూడా వస్తుంది"అని ఆయన స్పష్టం చేశారు.

నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో అమలు కాబోదని సభకు అమిత్ షా తెలియజేశారు. "డీలిమిటేషన్ కమిషన్ నివేదికను పార్లమెంటు ఆమోదించి, రాష్ట్రపతి ముద్ర పడిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఇదంతా 2029కి ముందు జరిగే ప్రసక్తే లేదు. కనుక అప్పటిదాకా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరుగుతాయి" అని చెప్పారు. లోక్‌సభలో సీట్ల సంఖ్య పెంపుపై విపక్షాల ప్రశ్నలకు బదులిస్తూ అమిత్ షా ఒక ఉదాహరణ చెప్పారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే ముందుగా మొత్తం సీట్లను 50 శాతం పెంచాలి. అప్పుడు వాటిలో 33 శాతం మహిళలకు కేటాయించినా మిగతా ఓపెన్ సీట్ల సంఖ్య యథాతథంగా ఉంటాయి.

## ఇజ్రాయెల్, లెబనాన్ కాల్పుల విరమణ

ఇస్లామాబాద్: దశాబ్దాలుగా శత్రుత్వంతో రగిలిపోయిన ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య ఎట్టకేలకు శాంతి పవనాలు వీచాయి. పదిరోజులపాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇరుదేశాల మధ్య అమల్లోకి రానుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. భారతకాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకిరానుంది. దశాబ్దాల తర్వాత తొలిసారిగా అమెరికా వేదికగా ఇజ్రాయెల్, లెబనాన్ జరిపిన చర్చలు ఫలించాయని ట్రంప్ తన సొంత సామాజికమధ్యమం 'ట్రూత్ సోషల్'లో ప్రకటించారు. "లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్‌తో, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో ఇప్పుడు చక్కటి సంభాషణ పూర్తయింది. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణకు ఇద్దరూ అంగీకరించారు. 34 ఏళ్ల తర్వాత వాషింగ్టన్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధులు భేటీ అయ్యారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ డేన్ రెజీన్ కెయిన్‌లు ఇరుదేశాల నేతలను సమన్వయ పరుస్తూ శాశ్వత శాంతికి కృషిచేస్తారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 9 యుద్ధాలను ఆపే అదృష్టం నాకు దక్కింది. ఇది పదోది. తదుపరి చర్చల కోసం శ్వేతసౌధానికి రావాలని ఔన్, నెతన్యాహూలను ఆహ్వానించా"అని ట్రంప్ ప్రకటించారు.

## తేజస్వీ వ్యాఖ్యలను తిప్పికొట్టండి

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆదేశించినట్లు తెలిసింది. తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయంటూ, బీజేపీ నేతల తీరును ప్రజల్లో ఎండగట్టాలని సూచించినట్లు సమాచారం. కాగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా, పార్లమెంట్‌లో తెలంగాణ గళాన్ని బలంగా వినిపించాలని ఆయన చెప్పారు. గురువారం సీఎం ఢిల్లీ తుగ్లక్‌రోడ్డులోని తన అధికారిక నివాసంలో పలువురు పార్టీ ప్రజా ప్రతినిధులతో భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, పార్లమెంట్‌లో రాష్ట్ర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తేజస్వీ వ్యాఖ్యలపై స్పందిస్తూ గట్టిగా తిప్పికొట్టాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా, తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రోద్భలంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. గతంలో 'తల్లిని చంపి, బిడ్డను బతికించారు' అంటూ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే... తాజాగా తేజస్వీ విమర్శలకు దోహదం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.


## దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు, నాది హామీ..

(మొదటి పేజీ తరువాయి)

అనుమతించాలని కోరారు. స్పీకర్ అనుమతితో బిల్లులపై మొదలైన చర్చ గురువారం అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా సాగింది. బిల్లుకు అనుకూలంగా అధికార, వ్యతిరేకంగా విపక్ష సభ్యుల వాదనలతో సభ హోరెత్తిపోయింది. బిల్లులపై ఓటింగ్‌కు శుక్రవారం సాయంత్రం నాలుగింటికి ముహూర్తం ఖరారైంది. వాటిలో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఆమోదానికి మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. మోదీ సర్కారుకు అందుకు అవసరమైన సంఖ్యా బలం లేని నేపథ్యంలో బిల్లు ఎలా గట్టెక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. దాంతో ఓటింగ్‌పై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్లమెంటు మూడు రోజుల ప్రత్యేక సమావేశాల్లో భాగంగా గురువారం ఉదయం లోక్‌సభ సమావేశం మొదలవగానే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును విపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించడంతో దానిపై 40 నిమిషాల పాటు తీవ్ర చర్చ జరిగింది. చివరికి డివిజన్ ఓటింగ్ అనంతరం సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. కేంద్రపాలిత ప్రాంతాల చట్ట (సవరణ) బిల్లును హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. తర్వాత చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ సభ్యుడు గౌరవ్ గొగొయ్ మోదీ సర్కారు తీరుపై నిప్పులు చెరిగారు. మహిళా రిజర్వేషన్ల సాకుతో లోక్‌సభ స్థానాలను అడ్డదిడ్డంగా పెంచుకుని రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ అసలు లక్ష్యమంటూ మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల నిమిత్తం పార్లమెంటు గతంలోనే చట్టం చేశాక మళ్లీ దానికి మార్పులను ప్రతిపాదించడం వెనక మతలబు ఏమిటని కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ కేంద్రాన్ని నిలదీశారు. రాజ్యాంగ సవరణ బిల్లును ఇతర బిల్లులతో కలిపి చర్చకు చేపట్టరాదంటూ అభ్యంతరం వెలిబుచ్చగా దాన్ని అమిత్ షా తోసిపుచ్చారు. ఒకే అంశానికి సంబంధించిన పక్షంలో వాటిని ఉమ్మడిగా చర్చకు చేపట్టిన ఉదంతాలు గతంలో ఉన్నాయని స్పీకర్ బిర్లా స్పష్టం చేశారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు రూపంలో దేశ ప్రజాస్వామ్యంపై మోదీ సర్కారు బాహాటంగా దాడికి దిగిందని కాంగ్రెస్ సభ్యురాలు ప్రియాంకా గాంధీ వద్రా దుయ్యబట్టారు. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశంలో ప్రజాస్వామ్యమే పూర్తిగా అంతమైపోతుందని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ స్థానాలను పెంచకుండా ప్రస్తుత 543 సీట్లకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయడంలో కేంద్రానికి ఇబ్బందేమిటని ఆమె నిలదీశారు. సవరణ బిల్లు, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వేణుగోపాల్ ఆరోపించారు. వాటి విషయంలో ఇంత హడావుడి ఎందుకని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లకు తమ పార్టీ మద్దతిస్తుందని స్పష్టం చేస్తూనే, జనగణన జరుగుతుండగానే ఈ హడావుడి కసరత్తు ఎన్నో అనుమానాలకు తావిస్తోందన్నారు. బిల్లు ఉద్దేశాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ సంక్షిప్తంగా ప్రసంగించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి కూడా మహిళా రిజర్వేషన్లను అమలు చేయకపోతే వారికి తీరని నష్టం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయమూ జరగబోదని స్పష్టం చేశారు. "బిల్లును వ్యతిరేకించే పార్టీలు పూడ్చుకోలేని విధంగా నష్టపోవడం ఖాయం. అది మాకే లబ్ధి చేకూరుస్తుంది" అని అన్నారు.

## మచ్చ సుధాకర్‌కు 'దళిత రత్న' పురస్కారం

- రవీంద్రభారతిలో ఘనంగా ప్రదానం
- వలిగొండ వాసికి దక్కిన అరుదైన గౌరవం



**తొలివెలుగు, వలిగొండ:** సామాజిక సేవలో చురుగ్గా ఉంటూ విద్యార్థి ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వలిగొండ మండలం మొగిలిపాకకు చెందిన మచ్చ సుధాకర్‌కు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్న సమయం నుంచే సుధాకర్ సామాజిక సమస్యలపై గళం విప్పారు. ప్రస్తుతం తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. సుధాకర్ చేస్తున్న సామాజిక పోరాటాలను, విద్యార్థి లోకానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ అల్లిబిల్లి మహేందర్, కో-చైర్మన్ దుమ్మటి సుదర్శన్ బాబు చేతుల మీదుగా సుధాకర్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. తాను పుట్టిన గ్రామానికి, జిల్లాకు ఈ అవార్డు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా నిరంతరం విద్యార్థుల పక్షాన పోరాడుతానని వెల్లడించారు. పురస్కారానికి తనను ఎంపిక చేసిన కమిటీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## బైకు ఢీకొని గొర్రెల కాపరికి తీవ్ర గాయాలు

- నాగారం శివారులో ప్రమాదం.. క్షతగాత్రుడి పరిస్థితి విషమం
- రామన్నపేట నుంచి హైదరాబాద్‌కు తరలింపు



**తొలివెలుగు, వలిగొండ:** మండలంలోని నాగారం గ్రామ పరిధిలో గురువారం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నేపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల నరసింహ గొర్రెలను కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఎప్పటిలాగే గురువారం నాగారం గ్రామ శివారులో గొర్రెలను మేపుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగారం నుంచి చౌటుప్పల్ వైపు వేగంగా వెళ్తున్న ఓ మోటారు సైకిల్ నరసింహను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహకు తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది బాధితుడికి ప్రాథమిక చికిత్స అందించి, చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## లక్ష్యం.. ప్రజా ప్రగతి!

- రాజాపేటలో 'ప్రజా పాలన' 99 రోజుల ప్రణాళికపై సమీక్ష
- ప్రభుత్వ ఫలాలు ఇంటింటికీ చేరాలి: తహసీల్దార్ ప్రదీప్, ప్రత్యేకాధికారిణి శాంత నిర్మల

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ పథకాలు పారదర్శకస్థాయిలో అర్హులందరికీ అందాలన్నదే లక్ష్యమని రాజాపేట తహసీల్దార్ వల్లపు ప్రదీప్, మండల ప్రత్యేకాధికారిణి శాంత నిర్మల పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ గీతాన్ని ఆలపించడంతో ప్రారంభమైన ఈ సభలో తొలుత ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం ఎంపీడీఓ నాగవేణి స్వాగత ఉపన్యాసం చేస్తూ శాఖల వారీగా లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వల్లపు ప్రదీప్ మాట్లాడుతూ.. రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల ద్వారా అందుతున్న మహాలక్ష్మి (రూ. 500 గ్యాస్ సిలిండర్), నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై నివేదికలు సమర్పించారు. రైతు భరోసా, రైతు బీమా, సన్న రకం వడ్లకు బోనస్ వంటి అంశాలను ఏఈఓలు వివరించారు. ఎస్ఐ లింగారెడ్డి 'అరైవ్ అలైవ్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గృహజ్యోతి పథకంపై ఏఈ చంద్రశేఖర్, ఇందిరమ్మ ఇళ్లపై ఏఈ వివేక్, మహిళా సంఘాల రుణాలపై ఏపీఎం మురారి నివేదికలు ఇచ్చారు. మండలంలోని ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆవుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.




## అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి

- వలిగొండలో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'పై విస్తృత సమీక్ష
- ప్రతి శాఖా నివేదికల సమర్పణ.. అధికారులకు దిశానిర్దేశం



**తొలివెలుగు, వలిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు కావాలని మండల ప్రత్యేకాధికారి జగన్నాథ రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాల మేరకు వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రగతి ప్రణాళికపై అన్ని శాఖల అధికారులతో ఆయన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మార్చి 6వ తేదీ నుండి 99 రోజులపాటు గ్రామ, మండల, రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందరికీ తప్పకుండా చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, ఒకవేళ అర్హత ఉండి ఎవరైనా లబ్ధి పొందకపోతే వారిని గుర్తించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం గ్రామ సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను, పథకాల అమలులో ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులు వారికి వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) జి. జలందర్ రెడ్డి, తహశీల్దార్ దశరథ్ నాయక్, మండల విద్యాధికారి భాస్కర్, మండల పంచాయతీ అధికారిణి (ఎంపీఓ) వై. ప్రేమలత, వ్యవసాయ అధికారిణి అంజని దేవి, వైద్యాధికారులు డా. వేణు మాధవి, డా. జ్యోతి, డా. ఖాజా, విద్యుత్ శాఖ ఏఈ నర్సింహ, పంచాయతీరాజ్ ఏఈ సందీప్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమ్య, ఐకేపీ ఏపీఎం అంజయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈలు కిరణ్, అశోక్, పలువురు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రగతి ప్రణాళికతో గ్రామాల్లో నవశకం!

- చౌటుప్పల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష
- సమష్టిగా పనిచేస్తేనే సత్ఫలితాలు: స్పెషల్ ఆఫీసర్ రవీందర్
- రాజకీయా తీత అభివృద్ధికి సహకరించాలి
- అభివృద్ధిలో రాజీ పడవద్దు: మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య





తొలివెలుగు, చౌటుప్పల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి పి. రవీందర్ సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడంలో ఏమాత్రం జాప్యం జరగకూడదని ఆదేశించారు.దకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రజాపాలన ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధిలో చౌటుప్పల్ మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఎంపీడీవో బి. సందీప్ కుమార్, తహశీల్దార్ వీరబాయి మండలంలోని ప్రగతి పనుల వివరాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె. అలువేలు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## బుధవారం కల్లా పాల బకాయిల చెల్లింపు

- ఎన్‌డీడీబీతో ఒప్పందం తుది దశకు..
- రైతులు సహకరించాలి: నార్ముల్ చైర్మన్ మధుసూధన్ రెడ్డి

**తొలివెలుగు, రాజాపేట:** నార్ముల్ (నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల యూనియన్) పరిధిలోని రైతులకు చెల్లించాల్సిన పాల బకాయిలను ఈ నెల 22వ (బుధవారం) లోపు పూర్తిస్థాయిలో జమ చేస్తామని సంస్థ చైర్మన్ గుడిపాటి మధుసూధన్ రెడ్డి ప్రకటించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత రెండు మూడు నెలలుగా నెలకొన్న ప్రతిష్టంభన త్వరలోనే తొలగిపోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)తో యూనియన్ కుదుర్చుకోబోయే ఒప్పందం ప్రస్తుతం తుది దశకు చేరుకుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేయాల్సిన అవగాహన ఒప్పందం (ఎమ్ఓయు) ఫైలు ప్రస్తుతం సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శుల వద్ద ఉందని, మరో మూడు నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. ఒప్పందం కుదిరిన వెంటనే నిధులు విడుదలవుతాయని, తద్వారా రైతులకు రావాల్సిన బకాయిలను బుధవారం నాటికి వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఆలస్యానికి చింతిస్తున్నామని, సంస్థ అభివృద్ధిని కాంక్షించి రైతులు మునుపటిలాగే పాలు సరఫరా చేస్తూ సహకరించాలని ఆయన కోరారు.



## ఆధారాల్లేకుండా విమర్శిస్తే సహించం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై ఆరోపణలు అర్థరహితం
- క్రషర్ అనుమతులు ఇచ్చింది గత ప్రభుత్వ హయాంలోనే..
- రాజాపేట మండల కాంగ్రెస్ నాయకుల ధ్వజం

**తొలివెలుగు, రాజాపేట:** ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని రాజాపేట మండల కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. గురువారం స్థానిక అతిథి గృహంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చల్లూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 324లో గత 20 ఏళ్లుగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని, 2019లోనే బిఆర్ఎస్ హయాంలో క్రషర్ పనులు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. ఆనాడు అనుమతులు ఇచ్చింది ఎవరో కల్లూరి రామచంద్రారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక బలహీన వర్గ నాయకుడు ఎమ్మెల్యేగా ఎదిగి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేకనే రామచంద్రారెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ చర్చకు తాము సిద్ధమని, ఆరోపణలు నిరూపించలేకపోతే ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఐలయ్యపై బురదజల్లే ప్రయత్నం చేస్తే గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# సవాల్ స్వీకరిస్తున్నాం.. తేదీ మీదే.. చర్చ మాదే!

- చల్లూరు క్రషర్ వద్దే తేల్చుకుందాం: కల్లూరి రామచంద్రారెడ్డి
- ఎమ్మెల్యే చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
- అక్రమ మైనింగ్ ఆగాల్సిందే..



**తొలివెలుగు, రాజాపేట:** చల్లూరు క్రషర్ వ్యవహారంలో చర్చకు సిద్ధమంటూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేసిన సవాల్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి స్వీకరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివాదాస్పదంగా మారిన సదరు క్రషర్ ప్రాంగణంలోనే ఈ బహిరంగ చర్చ నిర్వహిద్దామని ప్రతిపాదించారు. ఎమ్మెల్యే బిజీ షెడ్యూల్‌ను బట్టి ఆయనే తేదీని ఖరారు చేయాలని, చర్చకు తాము రావడానికి సిద్ధమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు, మేధావులు, రాజకీయ పక్షాలు మరియు పాత్రికేయుల సమక్షంలో ఈ చర్చ జరగాలని డిమాండ్ చేశారు. చల్లూరులో రాత్రివేళల్లో అక్రమంగా బ్లాస్టింగ్‌లు జరుగుతున్నా యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు. అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించడం సరికాదన్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, తక్షణమే సదరు క్రషర్ పనులను నిలిపివేసి విచారణ జరిపించడం ద్వారా ఎమ్మెల్యే తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## బాధిత గీత కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ. 5వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత
- అండగా నిలిచిన కల్లుగీత కార్మిక సంఘం, ఉప సర్పంచ్



**తొలివెలుగు, రాజాపేట:** వృత్తి ధర్మంలో భాగంగా ప్రమాదవశాత్తూ తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుడు బూరు పోశెట్టి కుటుంబానికి స్థానిక నాయకులు, కార్మిక సంఘం అండగా నిలిచారు. కుర్రారం గ్రామానికి చెందిన పోశెట్టి ఇటీవల కల్లు గీసే క్రమంలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న రాజాపేట మండల కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మండల కమిటీ తరఫున రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా రాజాపేట ఉప సర్పంచ్ కేదారి గౌడ్ మానవత్వంతో స్పందించి తన వంతు సాయంగా 50 కిలోల బియ్యాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఆపద సమయంలో కుటుంబానికి ధైర్యం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు పాండవుల లక్ష్మణ్ గౌడ్, గోపగాని యాదగిరి గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- సర్పంచులు, కార్యదర్శుల మధ్య సమన్వయం అవసరం
- 99 రోజుల ప్రగతి ప్రణాళికపై మండలస్థాయి సమీక్ష
- మండల ప్రత్యేక అధికారి సాహితి వెల్లడి




**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన '99 రోజుల ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సాహితి కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాములు అధ్యక్షతన మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల నిర్వహణలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహశీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి మాట్లాడుతూ.. రెవెన్యూ పరంగా ఎదురయ్యే అడ్డంకులను తొలగించి ప్రగతికి సహకరిస్తామని తెలిపారు. గ్రామాల ప్రశాంతత, భద్రత విషయంలో ఎస్సై డి. నాగరాజు పలు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## అన్నా మెమోరియల్ విద్యార్థుల 'శత' శాతం జోరు!

- సీబీఎస్ఈలో సత్తా చాటిన చౌటుప్పల్ విద్యార్థులు
- టాప్ స్కోరుతో దూసుకెళ్లిన సాన్వి
- సంబరాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలోని అన్నా మెమోరియల్ పాఠశాల సీబీఎస్ఈ ఫలితాల్లో తన మార్కును చాటుకుంది. 2025-26 మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించి 100% ఫలితాలను నమోదు చేశారు. ముఖ్యంగా డి. సాన్వి అనే విద్యార్థిని 500 మార్కులకు 473 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. భారీ సంఖ్యలో విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించడంతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను ఫాదర్ చిన్నప్ప రెడ్డి, ప్రిన్సిపాల్, యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన బోధన అందించడం వల్లే విద్యార్థులు ఇలాంటి ఉన్నత ఫలితాలు సాధించగలిగారని వారు కొనియాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, వారి విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తమ పిల్లల అద్భుత ప్రతిభ పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# వర్గీకరణ యోధుడికి 'దళిత రత్న' కిరీటం!

- వర్గీకరణ పోరాటమే ఊపిరిగా కృషి
- భూదాన్ పోచంపల్లిలో ఘన సన్మానం
- అభినందన సభలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు సోమవారం శంకర్ కు 'దళిత రత్న' పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ అవార్డు అందుకున్న ఆయనకు గురువారం స్థానిక పట్టణ కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై శంకర్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ సాధన కోసం శంకర్ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన సేవలకు లభించిన తగిన గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అభివర్ణించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, కొండమడుగు ఎల్లస్వామి, సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, మాజీ సర్పంచ్ యాకరి నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, పట్టణ అధ్యక్షుడు పోతగల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల లింగస్వామి, నాయకులు కుక్కస్వామి, బొడ్డు యాదయ్య, కుక్క కుమార్, వంగూరు స్వామి, సిర్పంగి మహేష్, కొండమడుగు రవి, మత్తు నరసింహ, పెద్దల కుమార్, ఏర్పుల రమేష్, కుక్క బిక్షపతి, సిర్పంగి ఐలయ్య, కంచర్ల గణేష్, మీసాల నరేష్, పెరమాండ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చింతలపల్లిలో వీధి కుక్కల స్వైరవిహారం

- ఐదుగురిపై దాడి.. తీవ్ర గాయాలు
- ఆసుపత్రి పాలైన వృద్ధురాలు
- ప్రాణభయంతో బెంబేలెత్తుతున్న గ్రామస్థులు
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు





తొలివెలుగు, జన్నారం: జన్నారం మండల పరిధిలోని చింతలపల్లి గ్రామంలో వీధి కుక్కలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గురువారం ఉదయం గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేసి ఐదుగురిపై దాడికి తెగబడ్డాయి. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు కాగా, గ్రామస్థులు భయాందోళనలతో వణికిపోతున్నారు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తన పనుల నిమిత్తం బయటకు వచ్చిన ఓ వృద్ధురాలిపై వీధి కుక్కల గుంపు ఒక్కసారిగా మూకుమ్మడిగా దాడికి దిగింది. ఆమె తేరుకుని తప్పించుకునే లోపే తీవ్రంగా కరిచి గాయపరిచాయి. ఈ దాడిలో వృద్ధురాలి చేతిపై లోతైన గాయాలు కావడంతో పాటు, తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను రక్షించి చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఇదే సమయంలో గ్రామంలో మరో నలుగురిపై కూడా కుక్కలు విరుచుకుపడి గాయపరిచాయి. ఒకే రోజు ఐదుగురిపై దాడులు జరగడంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది.

**పట్టించుకోని పంచాయతీ అధికారులు:**

గ్రామంలో గత కొంతకాలంగా వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, గుంపులు గుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై దాడులకు యత్నిస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బడికి వెళ్లే చిన్న పిల్లలు, వృద్ధులు ఇళ్లలోంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కుక్కల బెడద నివారించాలని గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నేడు ఐదుగురు ఆసుపత్రి పాలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే వీధి కుక్కలను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని, గ్రామంలో రక్షణ కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## పిల్లల భద్రత డ్రైవర్ల బాధ్యత

- స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి
- చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్
- ట్రినిటీ హైస్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**తొలివెలుగు, చౌటుప్పల్:** పాఠశాల విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత స్కూల్ బస్సు డ్రైవర్లపైనే ఉందని చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం స్థానిక ట్రినిటీ హైస్కూల్‌లో డ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి స్కూల్ బస్సుకు కచ్చితంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, రద్దీ ప్రదేశాలలో వాహనాలను అత్యంత జాగ్రత్తగా నడపాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవర్లు మద్యపానానికి దూరంగా ఉండాలని, విద్యార్థులను ఇళ్ల వద్ద నుంచి పాఠశాలకు, తిరిగి క్షేమంగా ఇళ్లకు చేర్చే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డ్రైవర్లతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బోధనా పద్ధతులను, పరికరాలను సీఐ పరిశీలించారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు అజయ్ భార్గవ్, ఉపేందర్ రెడ్డి, పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల తదితరులు పాల్గొన్నారు.






## ప్రయాణికుల కష్టాలు చూడరా?
## చౌటుప్పల్ హైవేపై 'ఓపెన్' బ్రిడ్జి కావాలి!

- అరకొర ఫ్లైఓవర్లతో ప్రయోజనం లేదు: సీపీఎం నేత జహంగీర్
- బస్టాండ్ వద్ద వంతెన నిర్మించకపోతే ఆందోళన తప్పదు

**తొలివెలుగు, చౌటుప్పల్:** "హైదరాబాద్‌కు అత్యంత చేరువలో ఉండి, వేల సంఖ్యలో వాహనాలు తిరిగే చౌటుప్పల్ బస్టాండ్ వద్ద వంతెన నిర్మించకపోవడం ఏంటి?" అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రశ్నించారు. గురువారం చౌటుప్పల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైవే విస్తరణ పనులు శాస్త్రీయంగా జరగడం లేదని విమర్శించారు. కేవలం కొన్ని చోట్ల మాత్రమే ఓపెన్ ఫ్లైఓవర్లు నిర్మించడం వల్ల బస్టాండుకు వెళ్లే ప్రయాణికులకు చుట్టు తిరగాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ముఖ్యంగా బస్టాండ్ ఎదురుగా ఓపెన్ ఫ్లైఓవర్ లేకపోతే ట్రాఫిక్ గందరగోళం ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. స్థానిక వ్యాపారస్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్లాన్ మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, రాగిరి కిష్టయ్య, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, తూర్పునూరు మల్లేశం, చిగురు ఈదయ, భావనలపల్లి స్వామి, సిల్వర్ జంగయ్య, మగుదల రాములు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి 'హస్తం' గూటికి.. ఎమ్మెల్యే కుంభం ఆహ్వానం!

- 50 మంది అనుచరులతో పార్టీలో చేరిన వారాల రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆకర్షితులయ్యే చేరికలు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అభివృద్ధి వారధులుగా మారాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో శివరెడ్డి గూడెం గ్రామానికి చెందిన యువ నాయకుడు వారాల రేవంత్ రెడ్డి సుమారు 50 మంది కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శాలువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, రేవంత్ రెడ్డి వంటి ఉత్సాహవంతుల చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో యువ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపు కోసం శ్రమించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాత మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, మరి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖజానాపై అదనపు భారం!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: 850 మంది సభ్యులతో కూడిన లోక్‌సభను ప్రతిపాదిస్తున్నందున ప్రభుత్వం పెరిగే వ్యయంతోపాటు దేశ రాజధానిలో ప్రతిపాదిత కొత్త ఎంపీలకు వసతి కొరతను కూడా ఎదుర్కోనున్నది. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశానికి కూడా స్థల సమస్య ఎదురయ్యే అవకాశం ఉంది. సాధారణ అంచనాల ప్రకారం సభ సమావేశంలో ఉన్న ప్రతిరోజు ప్రతి నియోజకవర్గంపై చేసే ఖర్చుకు అదనంగా ప్రభుత్వం ఒక్కో సభ్యుడిపైన దాదాపు రూ.1 లక్ష ఖర్చు చేస్తుంది. ఇందులో జీతాలు, ప్రయాణ భత్యాలు, వైద్య సౌకర్యాలపై ప్రభుత్వం చేసే ఖర్చు చేర్చలేదు. లూటియన్స్ జోన్‌లో ఇండ్ల కొరత ఉన్నందున పెరిగిన సంఖ్యలతో కేటాయింపుల విషయంలోనే తాము అడ్డంకిని ఎదుర్కొంటామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం పార్లమెంట్ సమావేశాల సమయంలో ప్రతి సభ్యునికి రోజుకు సమారు రూ.1 లక్ష, అంటే మొత్తం రూ. 8 కోట్లు ఖర్చు చేస్తుంది. మరో అంచనా ప్రకారం పార్లమెంట్ సమావేశాల సమయంలో నిమిషానికి రూ. 2.5 లక్షలు అంటే మొత్తం రోజుకు రూ. 8-9 కోట్లు ఖర్చు చేస్తుంది. సభ్యుల సంఖ్య 850కి పెరిగితే రోజువారీ ఖర్చు రూ. 3 కోట్లు అదనంగా పెరుగుతుంది. అయితే ఇది పార్లమెంట్ ప్రాంగణాన్ని నడపడానికి అయ్యే నిర్వహణ ఖర్చు మాత్రమే. పార్లమెంట్ సభ్యుల జీతంతోపాటు అనేక ఇతర సౌకర్యాలకు అర్హులు. ఒక ఎంపీ ప్రస్తుత జీతం నెలకు రూ. 1 లక్ష. ఐదేండ్ల పదవీ కాలంలో ప్రతి సంవత్సరానికి రూ. 2,000తోపాటు అదనంగా రూ. 25,000 పింఛను ఉంటుంది. సభ్యులకు వసతి, తాత్కాలిక వసతి, ఉచిత రైల్వే టికెట్లు, ఉచిత ఫోన్ కనెక్షన్, ఉచిత విద్యుత్తు, ఒక నిర్దిష్ట పరిమితి వరకు ఉచిత నీరు వంటి సౌకర్యాలు లభిస్తాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు ఒక్క ఎంపీకి ఏడాదికి రూ. 4.29 కోట్లు ఖర్చవుతుంది. ప్రస్తుత ఎంపీల సంఖ్యకు అదనంగా 272 మంది కొత్త ఎంపీలను చేర్చడం వల్ల కేవలం పార్లమెంట్‌లోనే ఏటా అదనంగా రూ. 1,171 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్ర అసెంబ్లీల విస్తరణ, 4,000 మంది కొత్త సభ్యుల చేరికతో మరో రూ. 5,000-8,000 కోట్ల అదనపు ఖర్చు ఉండే అవకాశం ఉంది. సభ్యులకు వసతి సమకూర్చడం పెద్ద సమస్యగా మారవచ్చు. లుటియన్స్ జోన్‌లో సుమారు 850 బంగళాలు ఉన్నాయి. వీటిలో కొన్ని ఇండ్లను రాయబార కార్యాలయాలకు, ప్రజా స్మారక చిహ్నాలకు కేటాయించారు. మిగిలిన వాటిని వివిధ పూల్స్‌లో ప్రభుత్వానికి కేటాయించారు. 2015 వరకు లోక్‌సభ సభ్యుల పూల్‌లో 517 బంగళాలు ఉండేవి. బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో 8-9 సముదాయాల నిర్మాణం తర్వాత మరో 349 ఫ్లాట్లు దీనికి జత అయ్యాయి. కాగా, కొత్త భవనంలోని లోక్‌సభలో తగినంత సీటింగ్ ఉంది. ఒక్కో సభలో 880-890 సీట్లతో సీటింగ్ ఉంది. అయితే 1,100 మంది ఎంపీలు కూర్చునేంత సీటింగ్ లేదు. దశాబ్దం క్రితం 1927లో నిర్మించిన సంవిధాన్ సదన్‌లో ఉమ్మడి సమావేశం కోసం 800 ఎంపీలకు సరిపడ సీటింగ్ ఉందని, కొత్త భవనంలో ఆ సౌకర్యం లేదని ఒక అధికారి చెప్పారు.



## మా తొలి మిస్సైల్ దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్.. అమెరికాకు ఇరాన్ వార్నింగ్

చమురు రవాణా కు ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధి (హ్రీఝుత్ శీట ఎశీతీఎబఓ) విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ (వీశీఛ్ఝఝ ఖఝ్ఝఎవఅవఱ) సైనిక సలాహాదారుడు మోహ్‌సేన్ రెజాయి (వీశీష్ట్రంవఅ =వఝువఱ) అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా (ఖూూ) నౌకలు మునిగిపోతాయని వార్నింగ్ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్మూజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారని, ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా..? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా..? అని రెజాయ్ ప్రశ్నించారు. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. తమ క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి అమెరికా నౌకలను ధ్వంసం చేయగలవని పేర్కొన్నారు. మా దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాల ప్రాణాలు కూడా పోవచ్చని రెజాయ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వచ్చిన వార్తలపై కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యూఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే.. ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

## "చాణక్యుడు కూడా ఇలా ప్లాన్ చేయలేడు"..

**ప్రియాంకా సెటైర్లపై అమిత్ షా నవ్వులు..**



కేంద్రం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ గురువారం మాట్లాడారు. మహిళా కోటా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని, అయితే దీనిని అమలు చేయడానికి డీలిమిటేషన్ చేస్తుండటంపైనే తమ అభ్యంతరాలు ఉన్నాయని లోక్‌సభలో ఆమె అన్నారు. ఎన్నికల్లో పైచేయి సాధించడానికి ఇది ఒక రాజకీయ అస్త్రం అని ఆమె ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని దెబ్బతీయడానికి బీజేపీ తన పార్టీ పునాదులను బలోపేతం చసేకుంటోందని ఆమె అన్నారు. ఇదిలా ఉంటే, చాణక్యుడిని ప్రస్తావిస్తూ ఆమె వేసిన సెటైర్లు సభలో నవ్వులు పూయించాయి. కేంద్రం హోం మంత్రి అమిత్ షా కూడా ప్రియాంకా వ్యాఖ్యలకు నవ్వారు. "మీరంతా పక్కా ప్లాన్‌తో వచ్చారు. ఈ రోజు గనుక చాణక్యుడు బతికి ఉంటే మీ కుయుక్తికి ఆయన ఆశ్చర్యపోయి ఉండేవారు." అని ఆమె అన్నారు. ఈ వ్యాఖ్యలుకే అమిత్ షాతో పాటు మంత్రులు కిరెన్ రిజిజు నవ్వారు. రాష్ట్ర ఎన్నికల సమయంలో హఠాత్తుగా పార్లమెంట్ ఏర్పాటు చేయడం, ఎన్నికలకు ఒక రోజు ముందే ముసాయిదా ముందుకు తేవడం, మహిళా అభ్యున్నతి కోసం మోడీ అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారని మీడియాలో చర్చ జరిపించడం, ప్రతీ ఒక్కరూ ఆయనకు మద్దతు ఇచ్చేలా చేయడం, ఇలా ప్రతిపక్షాలను సందిగ్ధంలో పడేయడం అంతా ప్లాన్ అంటూ ఆమె ఆరోపించారు.

## నోయిడా హింసాకాండ వెనక పాకిస్తాన్ ఎక్స్ అకౌంట్లు..

జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఇటీవల నోయిడాలో హింసకు పాల్పడ్డారు. ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఈ హింసాకాండకు సంబంధించి 300 మందికి పైగా అరెస్టులు జరిగాయి. ఈ హింస వెనక పాకిస్తాన్ ప్రయత్నం ఉందని పోలీసులు గుర్తించారు. నివేదికల ప్రకారం, ఏప్రిల్ 13, 2026న పూతీశీబంఅఅంఝుఅఝుజఱ, ఏవీఱతీబిశ్రీశ్రీఝుంబి×చీజ అనే ఎక్స్ అకౌంట్ల ద్వారా అనేక పోస్టులు షేర్ చేసి, రెచ్చగొట్టినట్లు తేలింది. అశాంతిని రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు భంగం కలిగించడం ఈ పోస్టుల ఉద్దేశమని పోలీసులు గుర్తించారు. ఈ తప్పుడు సమచారంతోనే గౌతమ్ బుద్ధనగర్ లోని పలు ప్రాంతాల ఆగ్రహాన్ని వ్యాప్తి చేసినట్లు తేలింది. ఈ పోస్టుల ద్వారా రెచ్చగొట్టడంతోనే పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని, జనాలు ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చినట్లు తేలింది. రాళ్లదాడులకు పాల్పడటంతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేశారు. ఈ రెండు ఎక్స్ హ్యాండిల్స్ పాకిస్తాన్ నుంచే ఆపరేట్ అవుతున్నట్లు తేలింది. ఈ హింసను ప్రేరేపించడంలో పాకిస్తాన్ హస్తం ఉండొచ్చని భావిస్తున్నారు.

# అధికార ఎన్డీయే కూటమికి అనుకూలంగా లేని నంబర్లు



న్యూఢిల్లీ: ఎన్నో ఏండ్ల ఎదురుచూపుల అనంతరం పార్లమెంట్ గడప తొక్కిన మహిళా బిల్లుకు ఆమోదంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టేందుకే ఓటింగ్‌ను కోరిన సభ్యులు ఇక దానిని ఆమోదించేందుకు అంత సునాయాసంగా అంగీకరిస్తారా అన్న అనుమానాలు వస్తున్నాయి. బిల్లును సొంతంగా గట్టెక్కించేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి సొంతంగా సభ్యుల బలం లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. రాజ్యాంగ సవరణ అవసరమయ్యే మహిళా బిల్లు ఆమోదం పొందాలంటే ఉభయ సభల్లో మూడింట రెండు వంతుల మంది సభ్యులు మద్దతు తెలపాలి. కానీ అధికార ఎన్డీయే కూటమికి ఉభయ సభల్లోనూ అంత బలం లేదు. లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 మంది (54%) సభ్యుల మద్దతు ఉండగా, ప్రతిపక్ష కూటమిలో 233 మంది సభ్యులు ఉన్నారు. ఏడుగురు ఎంపీలు స్వతంత్రులు కాగా, మరో ఏడుగురు వైసీపీ, ఎంఐఎం, శిరోమణి అకాలీదళ్‌కు చెందినవారు ఉన్నారు. వీరు ఇంతవరకు బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్టు బహిరంగంగా ప్రకటించలేదు. లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు మహిళా బిల్లు ఆమోదం పొందాలంటే 360 మంది ఎంపీలు మద్దతునివ్వాలి. లేదా సమాజ్‌వాదీ (37 మంది ఎంపీలు), తృణమూల్(28 మంది ఎంపీలు) లేదా డీఎంకే (22 మంది ఎంపీలు) వంటి ఏవైనా రెండు విపక్ష పార్టీలు ఓటింగ్‌లో పాల్గొనకుండా గైర్హాజరు కావాలి. అప్పుడే ఈ బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఈ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందకపోతే.. వాటిని రాజ్యసభలో ప్రవేశపెట్టే అవకాశం ఉండదు. రాజ్యసభలో ఎన్డీయేకు అనుకూలంగా 141 మంది (58%) సభ్యులు ఉండగా, ప్రతిపక్షానికి 83 మంది ఎంపీల మద్దతు ఉన్నది. బీఆర్ఎస్, వైసీపీ, బీజేడీ, బీఎస్పీ, ఇండిపెండెంట్లు కలిపి 20 మంది ఉన్నారు. వీరి ఓట్లు బిల్లు ఆమోదానికి కీలకం కానుంది. ఎగువ సభలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే అధికార కూటమికి 163 మంది సభ్యులు (మూడింట రెండు వంతుల మంది) కావాలి. రాజ్యసభలో బీజేపీకి 107 మంది ఎంపీలుండగా, కాంగ్రెస్‌కు 28, టీఎంసీ 13, ఆప్ 10, డీఎంకేకు 8 మంది సభ్యులున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లులు ఆమోదం పొందేందుకు ఉభయ సభల్లో తమకు కావాల్సినంత సభ్యుల మద్దతు లేదని బీజేపీ నేతలు ప్రైవేట్‌గా అంగీకరిస్తున్నారు.

**మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం**

రాజ్యాంగ సవరణ కోసం ప్రవేశపెట్టే బిల్లులకు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభలో సభ్యుల హాజరు సగానికి (50%)కు పైగా ఉండాలి. హాజరైన వారిలో మూడింట రెండు వంతుల మంది ఆ బిల్లుకు మద్దతు తెలపాలి. అప్పుడే ఆ బిల్లు ఆమోదం పొందుతుంది. ఒకవేళ లోక్‌సభలోని 540 మంది సభకు హాజరైతే.. వారిలో 360 మంది తప్పనిసరిగా బిల్లులకు మద్దతు తెలపాలి.

# సుప్రీంకోర్టుకు చేరిన "టీసీఎస్ నాసిక్" మతమార్పిడుల కేసు.

ప్రముఖ టెక్ కంపెనీ టీసీఎస్ నాసిక్ బీపీఓ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఉన్నత స్థానంలో ఉన్న కొందరు ముస్లిం ఉద్యోగులు ఒక కుట్ర ప్రకారం హిందూ మహిళల్ని, ఇతర ఉద్యోగుల్ని టార్గెట్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. మహిళలపై లైంగిక వేధింపులు, బలవంతంగా మతమార్పిడులు, మత విశ్వాసాలను దెబ్బతీసేలా వ్యవహరించడం వంటి ఆరోపణల్ని నిందితులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టుకు చేరింది. ఇలాంటి చర్యలు ఉగ్రవాద చర్యల పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ అత్యున్నత న్యాయస్థానంలో ఒక పిటిషన్ దాఖలైంది. చట్టవిరుద్ధమైన మతమార్పిడులు అడ్డుకోవడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు. టీసీఎస్ నాసిక్ కేసు కేవలం ఒక్కటే కాదని, ఇది పెద్ద వ్యవస్థీకృత, బలవంతపు ప్రచారంలో భాగమని పిటిషనర్ వాదించారు. మోసపూరిత మరియు బలవంతపు మత మార్పిడులు దేశ ఐక్యతకు, భద్రతకు తీవ్రమైన ముప్పు అని పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. భారతదేశ జనాభా సమతుల్యతను మార్చడానికి విదేశీ సంస్థల నిధులతో నడిచే ఒక వ్యవస్థీకృత కుట్ర కిందకు వస్తాయని పిటిషనర్ వాదించారు. ఇలాంటి కార్యకలాపాలు దేశ సమగ్రతకు ప్రమాదకరమని, దీని వల్ల ఉగ్రవాదానికి సంబంధించిన చట్టాల కింద పరిగణించాలని కోరారు. మత స్వేచ్ఛ హక్కు సంపూర్ణమైంది కాదని, అది ప్రజాభద్రత, నైతికతకు లోబడి ఉంటుందని పిటిషన్ నొక్కి చెప్పారు. ఈ కేసులో 9 మంది బాధితులు నిందితులపై ఫిర్యాదు చేశారు. వీరిలో చాలా మంది మహిళలే. అనుచితంగా తాకడం, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం, లైంగిక వేధింపుల వంటి నేరాలకు నిందితులు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్లు నమోదయ్యాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులు ఒక గ్రూప్‌గా పనిచేస్తూ ఈ అరాచకాలకు పాల్పడినట్లు నాసిక్ పోలీస్ కమిషనర్ సందీప్ కర్ణిక్ చెప్పారు. ఈ కేసులో ఏడుగురు పురుషులు, ఒక మహిళ సహా 8 మందిని అరెస్ట్ చేయగా, వీరికి సహకరించిన హెచ్ ఆర్ మేనేజన్ నిదా ఖాన్ పరీరాలో ఉంది. వివాదాల నేపథ్యంలో టీసీఎస్ నాసిక్ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వర్క్ ఫ్రం హోమ్ చేయాలని ఆదేశించింది.



# కుష్బూ వారసురాలిద్దరూ రెడీ..



ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయిన నటి కుష్బూ హిందీలో బాల నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ సంచలన నటి ఆ తరువాత తెలుగులో వెంకటేష్‌కు జంటగా కలియుగ పాండవులు చిత్రంలో కథానాయికిగా పరిచయమయ్యారు. ఆ తరువాత వరుషం--16 చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చారు. విశేషం ఏమిటంటే ఈమె తెలుగు, తమిళం భాషల్లో నటించిన రెండు చిత్రాలు విజయం సాధించాయి. ఆ తరువాత ఈ రెండు భాషల్లోనూ పలు చిత్రాల్లో నటించారు. తమిళంలో రజనీకాంత్, కమలహాసన్, విజయకాంత్, ప్రభు, కార్తీక్ వంటి నటులతో జంటగా నటించారు. కథానాయకిగా బిజీగా ఉండగానే దర్శకుడు సుందర్.సిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత రాజకీయ రంగప్రవేశం చేసి ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రచార కర్తగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరో పక్క నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తున్నారు. సుందర్.సి, కుష్బూ దంపతులకు అవంతిక, ఆనందిత అనే ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇప్పుడు వారు కూడా సినీ రంగప్రవేశం చేయడం విశేషమేమీ కాదు. చిన్న కూతురు ఆనందిత దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. పొన్నియిన్ సెల్వన్ 1, 2, థగ్‌లైఫ్ చిత్రాలకు పని చేశారు. పెద్ద కూతురు అవంతిక హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. ఈమె లండన్‌లో నటనలో శిక్షణ పొందారన్నది గమనార్హం. ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనలో నటించి తల్లి కుష్బూ ప్రశంసలు అందుకున్నారు. తాజాగా ఆరంభం అనే మలయాళ చిత్రంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో సరిత మరో ముఖ్య పాత్రను పోషిస్తున్నారు. సురేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ తాజాగా ప్రారంభమైంది. అవంతిక త్వరలో తమిళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ అవుతారని ఆశించవచ్చు.

# కాన్సెప్ట్ బాగుంది కానీ... అందులో వాస్తవం లేదు: దర్శకుడు క్రిష్



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తదుపరి మూవీ అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందని, అందులో ఏడుగురు హీరోయిన్లు నటించనున్నారనే వార్తలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై స్పందించిన క్రిష్.. ఏడుగురు హీరోయిన్లు, ట్రెక్కింగ్ అడ్వెంచర్.. ఐడియా బాగుంది, కానీ ఇది నిజం కాదని అన్నారు. సోషల్ మీడియాలో పుట్టిన మరో స్క్రిప్ట్ మాత్రమేనంటూ వదంతులకు తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు. తన కొత్త సినిమా వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తానని చెప్పారు. గమ్యం మూవీతో దర్శకుడిగా పరిచయమైన క్రిష్, ఆ మూవీతో తెలుగు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని అందించిన సంగతి తెలిసిందే. తరువాత వేదం, కృష్ణం వందే జగద్గురుమ్ వంటి ఆలోచనాత్మక చిత్రాలు, అలాగే కథానాయకుడు (ఎన్టీఆర్) వంటి బయోపిక్‌ను తెరకెక్కించారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన హరి హర వీరమల్లు, ఘాటి మూవీలు గత ఏడాది విడుదలయ్యాయి.





# సీతతో విడిపోయిన తర్వాత చాలా సంతోషంగా ఉన్నా: పార్తీబన్


సినీ నటి సీత, దర్శకుడు, నటుడు పార్తీబన్ 1990లో ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు 12 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత ఇద్దరూ విడిపోయారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ఒక కుమారుడిని దత్తత తీసుకున్నారు. విడిపోయినప్పటి నుంచి పార్తీబన్ ఒంటరిగానే ఉంటున్నారు. సీత మాత్రం మరొక వ్యక్తిని పెళ్లాడి, ఆ తర్వాత ఆయనతో కూడా విడిపోయారు. సీతతో తన వివాహం, విడిపోవడంపై పార్తీబన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... సీతతో విడిపోయినందుకు తాను ఎప్పుడూ బాధపడలేదని చెప్పారు. నిజం చెప్పాలంటే ఆమెతో విడాకులు తీసుకున్న తర్వాత చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. అయితే, ఆమెతో ఉన్న 12 సంవత్సరాలు తన జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని చెప్పారు. ఈ రోజుల్లో పురుషులు కానీ, మహిళలు కానీ వివాహం చేసుకోవడం కంటే స్వతంత్రంగా ఉండానికే ఇష్టపడతారని... ఏ మహిళ కూడా వివాహం పేరుతో పరిమితులు ఉండే జీవితాన్ని కోరుకోదని తెలిపారు. పార్తీబన్ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

# లొకేషన్‌లో వాగ్వివాదం

షూటింగ్ టైమ్‌లో క్రియేటివ్ డిఫరెన్స్ కామన్. డైరెక్టర్‌కీ డీవోపీకీ మధ్య ఈ విషయంలో గొడవలెక్కువగా వస్తుంటాయి. మూవీ మేకింగ్‌పై నిర్మాతకు అవగాహన ఉంటే కూడా సెట్‌లో వాదనలకు ఆస్కారం ఉంటుంది. ఈ మధ్య సెట్స్‌లో హీరోల జోక్యం కూడా ఎక్కువైందని, కొందరు హీరోలైతే డైరెక్టర్లకీ, డీవోపీలకూ షాట్ ఎలా పెట్టాలో కూడా చెబుతున్నారనీ ఇన్‌సైడ్ టాక్.. ఈ విషయంలో బాలీవుడ్ రెండాకులు ఎక్కువే చదివింది. అక్కడ హీరోయిన్లు కూడా జోక్యం చేసేసుకుంటున్నారట. వివరాల్లోకెళ్తే. యష్‌రాజ్ ఫిల్మ్స్ పతాకంపై లేడీ స్పై థ్రిల్లర్‌గా 'ఆల్ఫా' సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అలియాభట్ లీడ్‌రోల్ చేస్తున్నది. శివ్‌రావెల్ దర్శకుడు. ఈ సినిమా షూటింగ్‌లో అలియాభట్ జోక్యం అధికమవ్వడంతో లొకేషన్‌లో పెద్ద గొడవే జరిగిందట. లొకేషన్‌లో దర్శకుడు శివ్‌రావెల్‌కు క్రియేటివ్ అవుట్‌పుట్స్‌ని అలియా ఎక్కువగా ఇస్తుండటం అసలు గొడవకు కారణమైందని వినికిడి. యాదృశ్చికంగా బాబీడియోల్ కాంబినేషన్ సీన్స్ తీస్తున్నప్పుడు కూడా ఇది జరిగిందట. ఈ విషయంలో కొంతవరకూ బాబీడియోల్ సర్దుకుపోయినా.. వ్యవహారం శృతి మించడంతో అభ్యంతరం తెలియజేయక బాబీడియోల్‌కి తప్పిందికాదు. దాంతో ఇద్దరి మధ్య ఓ స్థాయిలో వాగ్వివాదం జరిగిందట. ఈ గొడవను చల్లార్చి, షూటింగ్‌ను సజావుగా నడిపించేందుకు దర్శక,నిర్మాతలు చాలా కష్టపడాల్సివచ్చిందట. ప్రస్తుతం బాలీవుడ్ మీడియాలో ఈ విషయంపై కథనాలు వెలువడుతున్నాయి. 'అల్ఫా' సినిమా విషయంలో అలియా అధికంగా జోక్యం చేసుకోవడానికి కారణం యష్‌రాజ్ ఫిల్మ్స్ గత చిత్రాలైన వార్ 2, మర్దానీ 3 చిత్రాల ఫలితాలేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# వారణాసి ఏ జానర్ మూవీ?... రాజమౌళి సమాధానం ఇదే!



దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'వారణాసి'పై ఆసక్తి రోజు రోజుకీ పెరుగుతోంది. హీరోగా మహేశ్ బాబు నటిస్తుండగా, ఈ చిత్రం ఏ జానర్‌కు చెందిందన్న దానిపై వివిధ ఊహాగానాలు వినిపించాయి. టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత కథపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రలో కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్ ఆధారంగా ఇది సైన్స్ ఫిక్షన్ సినిమా అంటూ ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారానికి స్వయంగా రాజమౌళి క్లారిటీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'వారణాసి'కి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా, ఇది ఆ జానర్ సినిమా కాదని స్పష్టం చేశారు. ఇది ఫాంటసీ --మైథలాజికల్ మూవీ అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ విజయంతో ఎలాంటి ఒత్తిడి లేదని రాజమౌళి తెలిపారు. కొత్త సినిమా ప్రారంభించినప్పుడు గత చిత్రాల ఫలితాలను దృష్టిలో పెట్టుకోనన్నారు. రుద్ర పాత్రలో వృషభంపై మహేశ్ ఎంట్రీ 'వారణాసి'లో గ్రేటెస్ట్ సినిమాటిక్ మూమెంట్ అవుతుందన్నారు. దర్శకుడిగా ప్రేక్షకులకు ఎప్పుడూ కొత్త అనుభూతి ఇవ్వాలనుకుంటానని తెలిపారు. అది కేవలం విజువల్స్ పరంగానే కాదు, భావోద్వేగాల పరంగానూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మూవీ రన్‌టైమ్ మూడు గంటల కంటే తక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నానన్నారు. పూర్తి సినిమాను ఐమ్యాక్స్ వెర్షన్‌లో తెరకెక్కించాలని భావించినప్పటికీ, కొన్ని పరిమితుల కారణంగా కొన్ని సన్నివేశాలనే ఆ ఫార్మాట్‌లో రూపొందిస్తున్నామని తెలిపారు. రామాయణం ఎపిసోడ్ షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, దానికి సంబంధించిన వీఎఫ్ఎక్స్ పనులు సవాలుగా ఉన్నాయని చెప్పారు. ఈ భారీ ప్రాజెక్ట్ 'వారణాసి' 2027 ఏప్రిల్ 7 న ప్రేక్షకుల ముందుకు రానుంది.

